జల్సాల కోసం దొంగతనాలు

- నలుగురు చైన్‌స్నాచర్ల అరెస్ట్
- వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్
- బంగారం, బైక్ స్వాధీనం

మట్వాడ, సెప్టెంబర్ 3: జల్సాలకు అలవాటు పడి ఈజీగా డబ్బు సంపాదించేందుకు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నలుగురు యువకులను అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. మంగళవారం మట్వాడలోని ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కాజీపేట దర్గా ప్రాంతానికి చెందిన సలాంబిన్ సల్మాన్(19), తాళ్ల అవినాష్(లక్కీ) హైదరాబాద్ బాలానగర్‌కు చెందిన అఫ్రోజ్, రఫిక్ బృందంగా ఏర్పడ్డారు. వీరు వరంగల్, హనుమకొండ నగరంలో సాయంత్రం ఒంటరిగా బయటకు వెళ్లే మహిళలను వెంబడిస్తూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. జూలై 30న బంధువరం రాజ్యలక్ష్మి(వృద్ధురాలు) వరంగల్ చౌరస్తా వద్ద ఓ షాపులోకి వెళ్లింది. అవినాష్, సల్మాన్ ఆ షాపులోకి వెళ్లి పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్నట్లు నటించారు. ఈ క్రమంలో రాజ్యలక్ష్మి మెడలో ఉన్న పుస్తెలతాడును లాక్కొని పరారయ్యారు. ఆమె ఇంతే జార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మట్వాడ క్రైమ్, ఇతర పోలీసులు బృందంగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానం, స్థానిక సమాచారంతో మంగళవారం కాజీపేట ఫాతిమా బ్రిడ్జి వద్ద ఆ నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పుస్తెలాతాడు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

దొంగలను అరెస్టు చూపుతున్న ఏసీపీ నందిరాంనాయక్

గంజాయికి అలవాటుపడి..

నిందితుడు సల్మాన్ చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో దర్గా కాజీపేట వద్ద మిషన్ షాపులో పనిచేసేవాడు. ఈ క్రమంలో జరిగిన దొంగతనం కేసులో సల్మాన్ నిందితుడిగా ఉన్నాడు. బీహార్ రాష్ట్రం నుంచి గుర్రాలపై వచ్చే వ్యక్తులతో స్నేహంగా ఉంటూ గంజాయికి అలవాటుపడి జూలాయిగా తిరుగుతూ దొంగతనాలకు పాల్పడేవాడు. ఇలా హైదరాబాద్‌కు వెళ్లిన సల్మాన్ ఓ ఎలక్ట్రిషన్ షాపులో పని చేస్తున్న సమయంలో అఫ్రోజ్ పరిచయమయ్యాడు. ఆ ఇద్దరు తిరిగి కాజీపేటకు వచ్చి ఓ ఎలక్ట్రిషన్ షాపులో పని చేస్తుండగా తాళ్ల అవినాష్ వీరికి పరిచయమయ్యాడు. ఈ నలుగురు జల్సాల కోసం దొంగతనాలను ఎంచుకున్నారు. నేరస్తులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన మట్వాడ సీఐ టి.గోపి, ఎస్సైలు వెంకన్న, రాజు, క్రైమ్ సిబ్బంది ఉపేందర్, మహేందర్, శివ, అలీ, ఐటీ కోర్ సాజిద్‌ను ఏసీపీ అభినందించారు.

వ్యక్తిగత ప్రయోజనం కోసమే రీడిజైనింగ్

- బిష్టిబొమ్మల దహనానికి దొంతి అనాలోచిత విధానాలే కారణం
- నిరసనలను బీఆర్ఎస్‌కు అంటగట్టడం అవివేకం
- నిర్వాసితులకు అండగా ఉంటాం
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి, సెప్టెంబర్ 3: వ్యక్తిగత ప్రయోజనం కోసమే ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రంగాయచెరువును రీ డిజైనింగ్ చేయించేందుకు ప్రయత్నిస్తున్నాడని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్ది మాట్లాడారు. రంగాయచెరువును రీ డిజైనింగ్ చేయాలని ఎవరు కోరారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో దొంతి అనాలోచిత విధానాల వల్ల ఏడు గ్రామాలు, వ్యవసాయ భూములను ముంపునకు గురిచేసి, అదే నిర్వాసితుల చేతిలో భంగపడిన విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా కోటి ఎకరాలకు సాగు, తాగు నీరందించేందుకు కృషి చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగానే నల్లబెల్లి మండలంలోని ఏజెన్సీ గ్రామాల అభీష్టం మేరకే ముంపును నివారించి రంగాయచెరువు రెండు టీఎంసీలు, పాకాల సరస్సు మూడు టీఎంసీల నీటి సామర్థ్యంతో ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశామన్నారు.

32వేల ఎకరాలకు సాగునీరు

రైట్ కెనాల్ 15వేల ఎకరాలు, లెఫ్ట్ కెనాల్ 10వేల ఎకరాలు, లెఫ్ట్ మెయిన్ కెనాల్ 7500 ఎకరాలు కలిసి మొత్తం 32వేల ఎకరాలకు నీరందించేలా కృషి చేసి, రెండేళ్లుగా రెండు పంటలకు నీరందించినట్లు పెద్ది గుర్తు చేశారు. ఈ పనులకు రూ.239కోట్లతో అగ్రిమెంట్ కాగా, రూ.203కోట్లు వినియోగించి పనులు పూర్తి చేశామన్నారు. ఓ ముగ్గురు కేసులు వేయడం వల్ల మూడుచోట్ల కెనాల్ పనులు నిలిచాయని గుర్తుచేశారు. మిగతా రూ.36కోట్లతో పెండింగ్ పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాడు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి కుమ్మక్కై రంగాయచెరువు ప్రాజెక్ట్ నిర్మాణ పనులను 60, 40 శాతం పంచుకున్న విషయాన్ని దొంతి మరిచిపోయినా నియోజకవర్గ ప్రజలకు గుర్తుందని హెచ్చరించారు. ఇరిగేషన్ సర్క్యూట్‌పై ఎలాంటి పరిజ్ఞానం లేని మాధవరెడ్డి దేవాదుల ప్రాజెక్ట్ సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్ ఎదుట రంగాయచెరువు రీ డిజైనింగ్ ప్రతిపాదన ఊసెత్తడం హాస్యాస్పదమన్నారు.

పూజలు ఎందుకు చేసినట్టో..

గతంలో పాకాల ఇరిగేషన్ సర్క్యూట్ బూటకమన్న మాధవరెడ్డి.. అదే ఇరిగేషన్ సర్క్యూట్ ద్వారా అభివృద్ధి చేసి గోదావరి జలాలతో నింపిన పాకాల సరస్సు వద్ద పూజలు ఎందుకు చేస్తున్నారని దొంతిని పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని, అన్నదాతలపై కేసులు పెట్టించడం కాదని, దమ్ముంటే తనపై పెట్టాలని సవాల్ విసిరారు. ఏజెన్సీ గ్రామాల రైతులు నిరసన కార్యక్రమాలు చేపడితే బీఆర్ఎస్ నాయకులను బాధ్యులు చేస్తూ పోలీసులు కేసులు పెట్టడాన్ని పెద్ది ఖండించారు. వివిధ సమస్యలతో పోలీస్‌స్టేషన్లకు వచ్చే వారిని మీది ఏ పార్టీ అని ప్రశ్నిస్తూ.. కేవలం అధికార పార్టీ వారికే వంతపాడడం హేయమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, ప్యాక్స్ చైర్మన్ చెట్టుపెల్లి మురళీధర్‌రావు, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కొత్త పెల్లి కోటిలింగాచారి, గందె శ్రీనివాస్‌గుప్తా, రాజారాం, గుమ్మడి వేణు, క్యాతం శ్రీనివాస్, తిరుపతినాయక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఆర్డీవో కౌసల్యాదేవి

వెలుగులోకి అక్రమాలు

సామాజిక తనిఖీ చేసిన డీఆర్డీవో కౌసల్యాదేవి

నర్సంపేటరూరల్, సెప్టెంబర్ 3: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేసిన పనులపై మంగళవారం నర్సంపేట మండల సామాజిక తనిఖీ ప్రజావేదికను ఎంపీడీవో అంబాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఆర్డీవో కౌసల్యాదేవి, జిల్లా విజిలెన్స్ అధికారి (డీవీవో) పద్మ నాభరెడ్డి, ఏడీవీసీ మాధవి హాజరయ్యారు. మండలవ్యాప్తంగా 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు చేపట్టిన పనులపై అధికారులు ప్రజావేదికలో చర్చించారు. మండలంలోని 27 గ్రామాల్లో రూ.4,10,07,562 విలువైన పనులు చేపట్టగా, ఇందులో ఈజీఎస్‌లో రూ.3,16,22,654, పీఆర్‌లో రూ. 41,95,137, ఎంపీఎంబీలో రూ.51,89,771 పనులు జరిగాయి. చెరువులు, కాల్వల పునరుద్ధరణ, రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు ఎండిపోవడం, వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటడం, ఆయిల్‌పామ్, పండ్ల తోటలు, ఫీల్డ్, ఫీడర్ చానల్స్, ఫారెస్టేషన్ రోడ్లు, డీసిల్టింగ్ పనుల్లో అక్రమాలు జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. చంద్రయ్యపల్లి కార్యదర్శి ప్రజావేదికకు హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

రసీదు అందజేస్తున్న డీఎల్పీవో

దుగ్గొండి, సెప్టెంబర్ 3: ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని డీఎల్పీవో కె.రాజీవ్‌సాగర్ కోరారు. గిర్నిబావిలో మంగళవారం ఆయన ఇంటి పన్నులు, లైసెన్స్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో మోడెం శ్రీధర్, కార్యదర్శి నూనె వేణుప్రసాద్, కారోబార్ ముస్కు రాజు పాల్గొన్నారు.

ఓటరు జాబితా రూపొందించాలి

వివరాలు తెలుసుకుంటున్న జడ్పీ సీఈవో రాంరెడ్డి

చెన్నారావుపేట, సెప్టెంబర్ 3: గ్రామాల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను త్వరగా రూపొందించాలని జడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీపీవో రాంరెడ్డి అన్నారు. జోజిపేట గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. అలాగే, ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. వార్డుల వారీగా ఓటరు జాబితా రూపొందించి త్వరగా ఆన్‌లైన్ చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు పక్కాగా జరగాలన్నారు. ఎంపీడీవో శ్రీవాణి, కార్యదర్శులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఏసీపీ

కరీమాబాద్, సెప్టెంబర్ 3: గణేశ్ నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని మామునూరు ఏసీపీ తిరుపతి భక్తులు, మండపాల నిర్వాహకులను కోరారు. మామునూరులో మంగళవారం సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో మామునూరు సబ్‌డివిజన్ పరిధిలోని గణేశ్ మండపాల నిర్వాహకులతో సమీక్షించారు. గణేశ్ మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల్లో నిత్యం నిర్వాహకులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

'షోకాజ్ నోటీసు ఇవ్వడం హేయం'

గిర్మాజీపేట, సెప్టెంబర్ 3: డీఆర్డీవో కౌసల్యాదేవి 'యూజ్ లెస్ ఫెలో' అని ఏపీఎంపై అమర్యాదగా మాట్లాడి షోకాజ్ నోటీసులు అందించి, మానసిక ఒత్తిడికి గురిచేయడం హేయమని జిల్లాలో పని చేస్తున్న 16 మంది ఏపీఎంలు అన్నారు. మంగళవారం వారు కౌసల్యాదేవిని కలిసి తమకు సామూహికంగా నెల రోజులు సెలవు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీఎంలకు తెలంగాణ రాష్ట్ర సెర్ప్ ఉద్యోగుల యూనియన్ జేఏసీ మద్దతు ప్రకటించింది.

స్కాలర్‌షిప్ టెస్ట్‌కు నోటిఫికేషన్

వరంగల్‌చౌరస్తా, సెప్టెంబర్ 3: విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించడానికి, ప్రతిభ కలిగిన విద్యార్థులకు రూ. 6 వేల వార్షిక స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన ద్వారా తపాలా శాఖ ఆధ్వర్యంలో ఫిలాటలీ (తపాలా స్టాంపులను సేకరించడం, అధ్యయనం చేయడం) అంశంపై పోటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు వరంగల్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి మధ్య విద్యాభ్యాసం చేస్తున్న పిల్లలు దరఖాస్తులను సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ వరంగల్ డివిజన్, 506002 పేరున రిజిస్టర్ లేదా స్పీడ్ పోస్టు ద్వారా ఈ నెల 12లోగా అందేలా పంపించాలని లేదా నేరుగా వరంగల్ డివిజన్ తపాలా కార్యాలయంలో సంప్రదించొచ్చని తెలిపారు.

రేషన్ షాపుల్లో తనిఖీలు

ఖిలావరంగల్, సెప్టెంబర్ 3: ఖిలావరంగల్ మండలంలోని పలు రేషన్ షాపులను రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారి కృష్ణ, ఫొరసరఫరాల క్వాలిటీ కంట్రోల్ అధికారి ఎంఏ రషీద్, వరంగల్ డీటీ నాయబ్ తహసీల్దార్ కిరణ్‌కుమార్ నేతృత్వంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పలు షాపుల్లో బియ్యం శాంపిల్స్ సేకరించి నాణ్యతా ప్రమాణాలు పరిశీలించేందుకు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

'పేదలపై కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు'

కాశీబుగ్గ, సెప్టెంబర్ 3: పేదలు, దళిత కాలనీలపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ విమర్శించారు. ఇటీవల ముంపునకు గురైన 14వ డివిజన్‌లోని ఎస్ఆర్‌నగర్‌ను డివిజన్ అధ్యక్షుడు కొత్తకొండ రాజు ఆధ్వర్యంలో మంగళవారం సందర్శించారు. అనంతరం అదనపు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రజల సమస్యలను వివరించారు.

చిరు వ్యాపారాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

వరంగల్, సెప్టెంబర్ 3: గ్రేటర్ పరిధిలో ఆహార చిరు వ్యాపారాలు నిర్వహించే వారు ఆహార పరిరక్షణ రిజిస్ట్రేషన్(ఎఫ్ఎస్ఎస్ఏఐ) తప్పనిసరిగా కలిగి ఉండాలని ఫుడ్ సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి తెలిపారు. రిజిస్ట్రేషన్ లేని వారి కోసం ఈ నెల 5న కార్పొరేషన్ ఆవరణలోని మెప్మా భవన్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆధార్‌కార్డ్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో రావాలని సూచించారు.

ముంపు ప్రాంతాలకు నేడు సెలవు

గిర్మాజీపేట, సెప్టెంబర్ 3: నెక్కొండ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఖిలావరంగల్ మండలం కరీమాబాద్ ప్రాంతంలోని పాఠశాలలు, ఎస్ఆర్‌నగర్‌లోని స్కూళ్ల, స్టేషన్‌రోడ్‌లోని కృష్ణా కాలనీ హైస్కూల్‌కు కలెక్టర్ ఆదేశాలతో బుధవారం స్థానిక సెలవు ఇస్తున్నట్లు డీఈవో జ్ఞానేశ్వర్ ప్రకటించారు. 9న రెండో శనివారం పని చేయాల్సి ఉంటుందని ఉపాధ్యాయులకు సూచించారు.

ఆర్యవైశ్యుల శ్రేయస్సుకు పాటుపడతా..

గిర్మాజీపేట, సెప్టెంబర్ 3: ఆర్యవైశ్యుల శ్రేయస్సుకు పాటుపడతానని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన దుబ్బ శ్రీనివాస్ అన్నారు. పాతబీట్‌బజార్‌లోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో మంగళవా రం జరిగిన సమావేశంలో ఆయనకు నియామక పత్రాన్ని ఎన్నికల కన్వీనర్, మహాసభ రాష్ట్ర కార్యదర్శి వంగేటి అశోక్‌కుమార్ అందజేశారు. ప్రధాన కార్యదర్శిగా నాగేంద్రబాబు, కోశాధికారిగా శ్రీనివాస్‌గుప్తా ఎన్నికయ్యారు.

మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి

- ప్రతి జిల్లాకు రెండు వేల మట్టి విగ్రహాలు
- కలెక్టర్ సత్యశారద

కలెక్టరేట్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, సెప్టెంబర్ 3: వినాయక చవితికి ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజించేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణితో కలిసి వినాయక చవితి సందర్భంగా పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని భక్తులను కోరారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రతి జిల్లాకు రెండు వేల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల పరిశీలన

కరీమాబాద్/గిర్మాజీపేట: లోతట్టు ప్రాంతాల వారి కోసం అండర్ రైల్వేగేట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంగళవారం కలెక్టర్ సత్య శారద పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే, 28వ డివిజన్ లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆశ్రయం పొందుతున్న రాందేవ్‌సచ్‌దేవ్ మార్వాడీ మంది రాన్ని కలెక్టర్ సందర్శించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న నిర్వాసితులు పరిస్థితులు అనుకూలించే వరకూ ఇక్కడి నుంచి వెళ్లొద్దని కోరారు. కార్యక్రమంలో కార్పొరేట్ గందె కల్పన, బల్దియా సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు, 28వ డివిజన్ అధ్యక్షుడు కురిమిళ్ల సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభానికి చర్యలు

నర్సంపేటరూరల్: నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె పట్టణం శివారులో నిర్మాణంలో ఉన్న జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల పనుల పురోగతిని పరిశీలించారు. సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, అధికారులతో కలిసి కలెక్టర్ రివ్యూ నిర్వహించారు. దాదాపు వైద్య కళాశాల, జిల్లా ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తయ్యాయని, అక్కడక్కడా మిగిలి ఉన్న సివిల్ పనుల్లో వేగం పెంచాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో కృష్ణవేణి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, కిషన్, టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేశ్ ఉన్నారు.

ఇన్‌చార్జీలుగా లీగల్ మెట్రాలజీ అధికారులు

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 3: జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌చార్జి అధికారిగా ఎండీ అజీజ్ పాషాను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. జగిత్యాలలో పనిచేస్తున్న అజీజ్ పాషా వరంగల్‌కు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. హనుమకొండ ఇన్‌చార్జిగా భూపాలపల్లి జిల్లాకు చెందిన ఇ.శ్రీలతను నియమించారు. ఆమె హనుమకొండతోపాటు భూపాలపల్లి జిల్లాను చూడాల్సి ఉంటుంది. వరంగల్, హనుమకొండ జిల్లాలకు అధికారిగా ఉన్న ప్రవీణ్ ఇటీవల అవినీతి ఆరోపణలపై సస్పెండ్ కాగా వీరిని ఇన్‌చార్జిలుగా ఉన్నతాధికారులు నియమించారు.

దీప్తి పతకం తేవాలి : ఎర్రబెల్లి ఆకాంక్ష

పర్వతగిరి, సెప్టెంబర్ 3: ప్యారిస్‌లో జరుగుతున్న పారా ఒలింపిక్స్‌లో పాల్గొన్న కల్లెడకు చెందిన అథ్లెటిక్స్ క్రీడాకారిణి జీవంజి దీప్తి 55.45 సెకన్లలో 400 మీటర్లు పరుగెత్తి ఫైనల్‌కు చేరుకుంది. మంగళవారం రాత్రి జరగనున్న ఫైనల్‌లో దీప్తి ప్రతిభ చాటి బంగారు పతకం తేవాలని ఆర్డీవోఫ్ కల్లెడ కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్ ఆకాంక్షించారు. అలాగే, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ దీప్తి పారా ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు చేరడం అభినందనీయమన్నారు.

వట్టివాగులో వ్యక్తి గల్లంతు

షేక్‌అజ్మద్ (ఫైల్)

నెక్కొండ, సెప్టెంబర్ 3: వాగు దాటుతూ ఓ వ్యక్తి నీటిలో గల్లంతైన ఘటన మంగళవారం మండలంలోని గుండ్రపల్లిలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ అజ్మద్ గుండ్రపల్లి-సూరిపల్లి శివారులోని వట్టివాగు సమీపంలో పొలానికి వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి వస్తూ వాగును దాటుతుండగా వరద ఉధృతికి నీటిలో కొట్టుకుపోయాడు. సమాచారం తెలుసుకున్న నెక్కొండ తహసీల్దార్ రాజ్‌కుమార్, చెన్నారావుపేట ఎస్సై అరుణ్‌కుమార్ ఘటన స్థలికి చేరుకొని పరిశీలించారు. రాత్రి వరకు వాగులో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. అజ్మత్‌కు భార్య చాందినీ, పిల్లలు ఇర్ఫాన్, శహాన ఉన్నారు.

పంట నష్టపరిహారం రూ.20 వేలు ఇవ్వాలి

వర్ధన్నపేట/పర్వతగిరి, సెప్టెంబర్ 3: భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20వేలు పరిహారం ఇవ్వాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం రూ.10వేలు మాత్రమే ప్రకటించడం సరికాదన్నారు. కాగా, వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీఆర్ఎస్ పర్వతగిరి మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు.

'ఖమ్మంలో దాడిని ఖండిస్తున్నాం'

గిర్మాజీపేట, సెప్టెంబర్ 3: ఖమ్మంలో కాంగ్రెస్ గూండాలు బీఆర్ఎస్ నేతలపై చేసిన దాడిని ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మంగళవారం తెలిపారు. సాయం చేసేది పోయి.. సహాయం చేయడానికి, పరామర్శించడానికి వచ్చిన ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పువ్వాడ, సబితా ఇంద్రారెడ్డి వాహనాలపై దాడి చేసి గుండాగిరి ప్రభుత్వమని కాంగ్రెస్ నిరూపించుకున్నదని ఎద్దేవా చేశారు. ప్రజలకు సాయం చేయడం చేతగాక, సాయం చేస్తున్న వాళ్లను చూసి ఓర్వలేక ఈర్ష్యపడి ఈ దాడికి తెగబడ్డారని దుయ్యబట్టారు.

స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తులు

గిర్మాజీపేట, సెప్టెంబర్ 3: పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, డీఈడీ, బీఈడీ, పాలిటెక్నిక్, ఐటీఐ చదువుతున్న విద్యార్థులతోపాటు 2024-25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ తీసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. అర్హులు http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా వివరాలను నమోదు చేసి దరఖాస్తులను డిసెంబర్ 31లోగా సంబంధిత కళాశాలల్లో అప్పగించాలని భాగ్యలక్ష్మి కోరారు.

ఖమ్మం తరలిన బల్దియా కార్మికులు

వరంగల్, సెప్టెంబర్ 3: ఖమ్మం ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య సేవలు అందించేందుకు గ్రేటర్ కార్పొరేషన్ కార్మికులు వెళ్లారు. కమిషనర్ ఆదేశాలతో మంగళవారం రాత్రి నాలుగు బస్సుల్లో 150 మందిని తరలించినట్లు సీఎంహెచ్‌వో రాజేశ్ తెలిపారు.

గణేశ్ ఉత్సవాలకు 1500 కేజీల లడ్డూ

హనుమకొండచౌరస్తా, సెప్టెంబర్ 3: 'వారాహి' ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పాపయ్యపేట చమన్ కాకతీయ థియేటర్ పక్కన బాలగణేశ్ ఉత్సవాలకు 1500 కేజీలతో భారీ లడ్డూను మూడు రోజులు నియమనిష్టలతో తయారు చేయించి, గణపతికి నైవేద్యంగా సమర్పించనున్నట్లు అధ్యక్షుడు సూర్య దేవర క్రాంతికుమార్ తెలిపారు. మంగళవారం హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ నగర ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని గణపతి దేవుడి భారీ లడ్డూను వీక్షించాలని కోరారు.

ఐసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 3: ఎంబీఏ, ఎంసీఏ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఐసెట్ కౌన్సెలింగ్ ప్రక్రి య ప్రారంభమైంది. విద్యార్థుల సందేహాల నివృత్తి కోసం వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ సూచించారు. ఈ నెల 8 వరకు ఐసెట్-24 క్వాలిఫై అయిన విద్యార్థులు సర్టిఫికెట్స్ ధ్రువీకరణ స్లాట్స్ ఎంచుకోవచ్చని, 9 వరకు ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సర్టిఫికెట్స్ ధ్రువీకరణ ఉంటుందని తెలిపారు.

'ముసాయిదా రైతులకు ఉపయోగపడాలి'

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

నర్సంపేట, సెప్టెంబర్ 3: నూతన రెవెన్యూ చట్టం ముసాయిదా రైతులకు ఉపయోగపడేలా ఉండాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ కోరారు. నర్సంపేటలో మంగళవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ భూములను అనుభవిస్తున్నా హక్కులు లేక కొందరు రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా రైతులకు హక్కుపత్రాలు అందించాలని కోరారు